క్లుప్తంగా

రేపటి నుంచి మహాకుంభాభిషేకం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం శరవణపురంలో వెలసిన శ్రీ శక్తిమారియమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమవుతోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు మహోత్సవం జరగనుందన్నారు. శని, ఆదివారాల్లో హోమ పూజలు జరుగుతాయన్నారు. సోమవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని వారు చెప్పారు.

ఇందిరమ్మ గార్మెంట్ ఏర్పాటు

ఐరాల: మండలంలోని అగరంపల్లె కాలనీలో త్వరలో ఇందిరమ్మ గార్మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు హీరో స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ ఏ.పరదేశి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ కులాలకు చెందిన నిరుపేదలైన మహిళలు, యువతులకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి సంస్థ అండగా నిలుస్తోందన్నారు. 18 నుంచి 34 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. మూడు నెలల శిక్షణ కాలంలో 50 మంది మహిళలకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతినెలా వేతనంతో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తామన్నారు. ఏప్రిల్ 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9014385038, 9985183239 ను సంప్రదించాలని ఆయన కోరారు.

నవోదయ పాఠశాలకు ఎంపిక


నాగార్జున

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు నాగార్జున పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఇటీవల నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి జరిగిన పరీక్షలో నాగార్జున ఉత్తీర్ణుడయ్యాన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. మారుమూల అటవీ ప్రాంతం నుంచి నవోదయ పాఠశాలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని కొనియాడారు.

కిట్లు పంపిణీ

యాదమరి: ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆరోగ్య కిట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుధారాణి అందజేశారు. శుక్రవారం ఆమె మండలంలోని పెరుమాళ్లపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైలేరియాతో బాధపడుతున్న వారి కోసం ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య కిట్లను అందిస్తోందని తెలిపారు. వ్యాధిగ్రస్తులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఫైలేరియాతో బాధపడుతున్న వేదాంబకు ప్రత్యేక అవసరాలకు అవసరమైన టవల్, సబ్బు, ఆయింట్‌మెంట్ తదితరాలను అందించారు. కార్యక్రమంలో డీఎంఓ వేణుగోపాల్, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రా’ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు


శిక్షణలో సేవాదళ్ కార్యకర్తలు

చిత్తూరు కార్పొరేషన్: జనసేవాదళ్ వ్యవస్థాపకుడు చంద్రా రాజేశ్వరరావు స్ఫూర్తితో ముందుకు వెళదామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, సేవాదళ్ జిల్లా క్యాంప్ ఇన్‌చార్జ్ చలపతి మాట్లాడారు. శుక్రవారం స్థానిక లెనిన్ నగర్‌లో మణి, గోపినాథ్, రమాదేవి నాయకత్వంలో జనసేవాదళ్ శిక్షణ క్యాంపు జరిగింది. వారు మాట్లాడుతూ దేశంలో విపత్కర సంఘటనలు సంభవించినప్పుడు సేవాదళ్ క్యాంప్‌లో శిక్షణ పొందినవారు సహాయక చర్యల్లో పాల్గొంటారన్నారు. గతంలో విజయవాడలో బుడమేరు వల్ల జరిగిన నష్టంలో నాయకులు తమవంతుగా సేవ చేశారన్నారు. అప్పుడు అర్ధరాత్రి సమయంలో ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, భోజనాలు అందించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాగే కేరళలో వచ్చిన వరదలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, రఘు, లతరెడ్డి, బాలాజీ రావు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం ప్రజావేదిక సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్, ఏపీఓ కిరణ్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఉన్నతాధికారుల సమక్షంలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రారంభం అవుతుందన్నారు. 2023–24 సంవత్సరంలో మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులపై బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు.

జీపీటీపీ.. సర్వేలతో బీపీ..


చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పంచాయతీ కార్యదర్శులకు చేతినిండా సర్వేలు ఉన్నాయి. 30 రకాల సర్వేలతో పడరాని పాట్లు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా వారు సర్వేల పేరిట పల్లెల వెంట పరుగులు పెడుతున్నారు. దీంతో పని ఒత్తిడితో అల్లాడిపోతున్నారు. పొద్దున లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు పంచాయతీల్లో పంచాయితీలు చేయడానికే తీరిక లేకుండా పోతోంది. ఇక వారి చుట్టూ ఆ సమస్యలు .. ఈ సమస్యలంటూ గిరాగిరా తిరుగుతున్నాయి. వీటితో పాటు అదనపు పనులు తలకు మించిన భారంగా మారుతున్నాయి. దీంతో వారు రాత్రి ఇంటికి చేరుకునే సమయానికి బీపీ పెరిగిపోతోంది. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రాత్రి 8.30 గంటల వరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కంప్యూటర్లకు అతుక్కుపోయారు. ఇదేమని అడిగితే వాళ్ల నోరు విప్పని పరిస్థితి. తీరా మండల అధికారులను విచారిస్తే..అది జీపీటీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక)గా చెప్పుకొచ్చారు. గత కొన్ని రోజులుగా ఈ జీపీటీపీ పనిమీద ఆన్‌లైన్ నమోదులో ఇలా బిజీగా ఇమిడిపోయారట.

నష్టాల నారికేళ..


కొబ్బరికాయలపై నల్లమచ్చలు

గుడిపాల: మండలంలో కొబ్బరి తోటలకు తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలం వచ్చిందంటే కొబ్బరికి మంచిగిరాకీ ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరికాయలకు డిమాండ్ ఏర్పడింది. ఈ సమయంలో తెగుళ్లు సోకడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. వరి, మామిడి, చెరుకు రైతులతో పాటు కొబ్బరిసాగు రైతులు కూడా నల్లతెగుళ్లతో నష్టపోతున్నారు. కొబ్బరిచెట్లు సాగు చేయడానికి తక్కువనీరు, ఖర్చు అవుతుంది. తరచూ తెగుళ్లు సోకుతుండడంతో నష్టం వాటిల్లి అప్పులు మిగులుతున్నాయని కొబ్బరి రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కొబ్బరికాయల రేట్లు అధికంగా ఉన్నా కాయలపై నల్లమచ్చలు ఉండడంతో సరైన ధర పలకడం లేదు. మండలంలో శ్రీరంగంపల్లె, 189 కొత్తపల్లె, వసంతాపురం, నంగమంగళం, మందికృష్ణాపురం, చింతగుంటూరు, కోలాపూరు గ్రామాల్లో అధికసంఖ్యలో కొబ్బరిసాగు ఉంది. తెగుళ్ల నివారణకు ఉద్యానవనశాఖ అధికారులు సరైన అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గోమాతకు ప్రాణం పోసి..


పాడి ఆవును క్షేమంగా బయటకు తీసిన స్థానికులు, ముస్లింలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): మురుగునీటిలో పడిన ఓ పాడి ఆవుకు స్థానికులు ప్రాణం పోశారు. చిత్తూరు నగరం బజారు వీధిలోని ఓ కాలువలో ఆవు మేత మేస్తూ కాళ్లు జారి పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును కాపాడే ప్రయత్నం చేశారు. తాడు సాయంతో అక్కడే ఉన్న ముస్లింలు, మరికొంతమంది కలిసి కాలువ నుంచి ఆవును పైకి తీశారు. మురుగు కాలువలకు పైకప్పులు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక పక్షపాతి వైఎస్సార్‌సీపీ


నాయకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

– విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కార్మిక పక్షపాతి వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను జగనన్న అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం వారి కష్టాలను పట్టించుకునే వారు లేరన్నారు. మొదటి నుంచి కార్మికుల కష్టాలను తెలుసుకుని వైఎస్సార్‌సీపీ వారికి మేలు చేసిందన్నారు. ట్రేడ్‌యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు అనుబంధ సంఘాల సహకారంతో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, అప్పొజీ, మధురెడ్డి, అంజలిరెడ్డి, ప్రతిమారెడ్డి, నౌషాద్, స్టాండ్లీ, వెంకటేష్, హరీషారెడ్డి, మదన్, సంపత్, రాజేష్, రంజిత్, మురళీ, రమేష్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో విజయానందరెడ్డి


ట్రేడ్‌యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి పక్కన చాన్‌బాషా

ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కృషి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కృషి చేసిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం హైరోడ్డులోని మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ఐదేళ్ల పాలనలో ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. గతంలో తాను తన సొంత ఖర్చులతో 9 వేల కుటుంబాలకు పైగా రంజాన్ తోఫా అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, శేషాపీరన్ మసీదు కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, అధ్యక్షుడు అనిద్‌షా, నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు ఆసు, ముజీబ్, నవాజ్, నస్‌షాద్, అల్తాఫ్, వెంకటేష్, అన్సు, న్యాయవాది జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న జయరాముడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డెమో అధికారి జయరాముడు తెలిపారు. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లిలోని సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భిణులకు పౌష్టికాహార నిమిత్తం రూ.6 వేలు పారితోషికం ఇస్తోందన్నారు. విడతల వారీగా జమయ్యే ఈ నగదు ద్వారా అర్హులైన వారు లబ్ధిపొందేలా చూడాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్యాంసుగుణకుమార్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వదలం

కుప్పంరూరల్: ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని .. ఒకవేళ కాదని ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే తాము ఎప్పుడైనా స్వాధీనం చేసుకోవడం ఖాయమని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు హెచ్చరించారు. శుక్రజువారం మండల పరిధిలోని సజ్జలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 10లో ఆక్రమణకు గురైన స్థలాన్ని సర్వే చేసి 5 ఇళ్లకు రోడ్డు ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల నుంచి వచ్చిన వినతి మేరకు తహసీల్దారు చిట్టిబాబుతో కలిసి ఆయన శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. సర్వే నెం.10లో ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, శాశ్వతంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయించారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


కట్టకిందపల్లెలో వృద్ధులకు వైద్యం చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆయన గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. వృద్ధులు ఎండల్లో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులు ఎండల్లో తిరగకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని పగడమానువీధిలోని శ్రీరామభజన మందిరంలో ఆదివారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ధర్మకర్త ఎన్‌ఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవం మార్చి 7వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం అభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు, పంచాంగ పఠనం ఉంటుందన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న చైర్మన్ మోహన్

ఐరాల: రోజురోజూకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ మోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో చైర్మన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్న కూలీలకు పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీడీఓ భువనేశ్వరి, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని, సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ఎంపీడీఓ కార్యలయం సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారిద్దాం

తవణంపల్లె: పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ–పఢాయ్ బీ రెండవ రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని, ఐరన్, విటమిన్ లోపం తగ్గించడానికి సమతుల ఆహారం ఇవ్వాలని వివరించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టేలా చూడాలన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: బాలికల్లో పోషకాహార లోపాలను గుర్తించి సరైన పోషకాహారం కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని వసంతాపురం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పావని తెలిపారు. శుక్రవారం పశుమంద అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం శక్తి యాప్‌ను ప్రతి మహిళా మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

యాదమరి: వేసవికి మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ ఉషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె చిత్తూరులోని తన కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఫిబ్రవరి1వ తేదీ నుంచి 40 రోజుల పాటు క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా తాగునీటి వనరుల పరిస్థితిపై సర్వే నిర్వహించామన్నారు. మండలంలో దాదాపు 217 చేతి పంపులు ఉండగా.. 175 వరకు పని చేస్తున్నాయని, 42 చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. మండల గ్రాంట్ నిధులచే రూ.20.05 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా 14 నీటి ట్యాంకర్లను సిద్ధం చేశామన్నారు. జలజీవన్ పథకంలో భాగంగా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతి


సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న వినాయకం

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల సమస్యలపై జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడుకు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం విన్నవించారు. ఆయన మాట్లాడుతూ పీఎఫ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని, పీఎఫ్ సమస్యలపై ప్రత్యేక సిబ్బందితో వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అంతర్ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పీఎఫ్‌కు సంబంధించి బదిలీ తదితర ఇబ్బందులను తొలగించాలని కోరారు. కారుణ్య నియామకాలను నెలవారీ సమీక్షించి ఎప్పటికప్పుడు భర్తీ చేయాలన్నారు. ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీల నిబంధనలు పాటించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, నాయకులు మహేష్, షణ్ముగం , అరుణ్‌కుమార్, దేవరాజులు, కుమార్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రుతిమించిన బర్త్ డే వేడుకలు

చిత్తూరు టాస్క్‌ఫోర్స్: చిత్తూరు నగరానికి చెందిన టీడీపీ నేత వసంతకుమార్ శుక్రవారం జన్మదిన వేడుకలు శృతిమించాయి. నగరం మొత్తం ఆయన ఫ్లెక్సీలు, కటౌట్లతో నిండిపోయాయి. ఇక సాయంత్రం నుంచి నగరంలోని పలు ప్రధాన కూడళ్లల్లో టీడీపీ శ్రేణులు వసంతకుమార్ చేత కేకులు కట్ చేయించడం, బాణసంచా పెట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా గాంధీ విగ్రహం కూడలిలో వారి సంబరాల కారణంగా గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. కొంగారెడ్డిపల్లెలో కూడా ఇదే రీతిన వ్యవహరించడంతో ఓ అంబులెన్సు అత్యవసర వేళ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ప్రజలను ఇలా ఇబ్బందులకు గురిచేసి, ట్రాఫిక్ సమస్యను సృష్టించి బర్త్ డే వేడుకలు జరుపుకోవడం ఏంటని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

4 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు చిత్తూరు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం, రాత్రి పలు సేవలు ఉంటాయన్నారు. మార్చి 4న విష్వక్సేన తిరుమంజనం, అంకురార్పణ, విష్వక్సేన ఉత్సవం, 5న ధ్వజారోహణం, సప్త ఉత్సవం, సింహవాహనం, 6న శ్రీరామనవమి, హంసవాహనం, సూర్యప్రభవాహనం, 7న గరుడవాహనం, హనుమంతవాహనం, 8న శేషవాహనం, చంద్రప్రభవాహనం, 9న పల్లకి ఉత్సవం, యాళివాహనం, 10న వేణుగోపాల అలంకరణ, గజవాహనం, 11న రథోత్సవం, తోట ఉత్సవం, 12న పల్లకిలో వెన్న కృష్ణుడి అలంకరణ, గుర్రపు వాహనం, 13న పల్లకిలో ఉత్సవం, పుణ్యకోటి విమానం, 14న అష్టోత్తర శత కలశ, మహాతిరుమంజనం, సీతారాములకల్యాణం , పుష్పపల్లకి షేవ, 15 ధ్వజావరోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి పరిశీలన


ప్లానింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ వన్‌డిపోను శుక్రవారం రాష్ట్ర రవాణశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. డిపో ఆవరణంలోని ఖాళీ స్థలాన్ని సందర్శించారు. అనంతరం కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్‌పై అధికారులతో చర్చించారు. ఇది కాకుండా మరో నాలుగు, ఐదు ప్లానింగ్‌లు ఇవ్వాలని డీపీటీఓ జగదీష్‌కు సూచించారు. అందులో ఏది బాగుంటే ఆ ప్లాన్‌తో ముందుకు వెళ్దామని అధికారులకు వివరించారు. ఇక నెల్లూరు, విజయవాడ, తిరుపతి నుంచి వచ్చే బస్సులు బైపాస్ మీదుగా బెంగళూరుకు వెళ్తున్నాయని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీని కారణంగా చిత్తూరులోని ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోందని, ఇక బస్టాండులోని వ్యాపారాలు సక్రమంగా నడవడం లేదని వారు ఆయనకు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చుడా చైర్మన్ కఠారిహేమలత, డీఎం కృష్ణమూర్తి, నాయకులు ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి


మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి మాధవి

బంగారుపాళెం: మహిళలు, యువతులు పోక్సో చట్టంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు 1వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం.మాధవి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కరిడివారిపల్లెలో న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, యువతులు, మహిళలపై లైంగిక దాడికి పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కఠినంగా శిక్ష విధించడం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. మహిళా చట్టాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ కత్తి శ్రీనివాసులు, ఎస్‌ఐ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

యాదమరి: ప్రతి పౌరుడు కూడా తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్రవూరులో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పౌరులందరికీ రాజ్యాంగం పవిత్ర గ్రంథం లాంటిదన్నారు. తహసీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ ఎస్సీల కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, దళిత సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కారిస్తాం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కారించడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సంతపేట సెక్షన్ పరిధిలోని తేనబండలో ఉన్న ధర్మరాజుల గుడి వీధిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా చవటపల్లెలో మరో 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.